# మళ్ళీ చెప్పిన కథలు



రావి కొండలరావు

ఒక పెద్ద అడవి. ఆ అడవినిండా జంతువులు. క్రూరమైనవీ. అక్రూరమైనవీ. ఆ జంతువుల్లో కోతులు కూడా వున్నాయి. ఈ కోతులన్నవి తిన్నగా వుండవు గనక. వంకరపన్లు చేస్తాయి. కోతి చేష్టలు చేస్తాయి. అటువంటి కోతులు ఎక్కువగా మెసిలే ఆ అడవిలోని ఒక చోట. చెట్లు నరకడానికని కొందరు మనుషులొచ్చారు. కొందరు చెట్లు పడగొడుతూ వుంటే కొందరు రంపాలతో నరికి పలకలు పలకలుగా కోస్తున్నారు. ఆ మనుషులూ వాళ్ళ మనిషి చేష్టలూ కోతులకి వింతగా కనిపించాయి. ఒక్కో చెట్టు కొడుతున్నప్పుడల్లా కోతులు కిచకిచలాడుతూ కోతికొమ్మచ్చులాడుతున్నట్టు తిరుగుతూనే వున్నాయి. నాలుగైదు రోజులపాటు మనుషులంతా అలా పనిచేసిన ఐదోరోజున ఓ కోతికి ఓ బుద్ధి పుట్టింది. తనూ వాళ్ళలాగే రంపంతో కర్రను కోస్తే ఎలా వుంటుంది?— అదేదో సరదాగా. తమాషాగా వుందిగదా! అంచేత. ఆ కోతి తన మనసులోని కోరికను తల్లి కోతితో చెప్పింది.

"వద్దమ్మా. తప్పు మనకి తెలీని విషయం అది. ఆ రంపాలూ ఆ కోతలూ మనకెందుకు? నీకంతగా కొయ్యాలని వుంటే. నీ ఈడువాళ్ళని కూచోబెట్టుకుని చక్కగా కోతలు కొయ్యి. అంతేగాని. ఈ రంపపుకోత మనకొద్దు తల్లీ. మనం హనుమంతుడి వంశం వాళ్ళం. శ్రీరాముడంతటివాడికి సహాయపడ్డ జాతి మనది. మనపూర్వీకులు గదలు ధరించి యుద్ధాలు చేసినవాళ్ళేగాని. రంపాలు పట్టుకొని చెట్లు నరకలేదు. ఈ వృత్తి నరులది. వాళ్ళకంటె మనం అతీతులంగనకే. మనం ఒక అక్షరం ఎక్కువ చదువుకుని వానరులం అయ్యాం. నా మాట విని రంపాల జోలికి

## కోతి తోక

పోకు" అని బుద్ధిగా కూచోబెట్టుకుని, తల్లి కోతి బుద్ధి చెప్పింది.

పిల్లకోతికి ఆ మాటలు బాగులేవు. ఓటు వేసి గెలిపించినవాడి కోరికని లక్ష్యపెట్టని ప్రజా ప్రతినిధిలాగా మొహం చీదరించి. చెట్టెక్కి కూచుంది. దాని ఆలోచనంతా రంపం మీనా కలపమీనా ఆ కోత మీదా వుంది. ఆ సాయంకాలం పనివాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత. కోతి నెమ్మదిగా చెట్టు దిగి రంపం వేపుచూసింది. సగంకోత కోసి రంపాన్ని కలపమధ్యలోనే వదిలి వెళ్ళారు వాళ్ళు. కోతికి అది మరీ సులువుగా కనిపించింది. కలపమీద కూచుని రెండు కాళ్ళూ అటూ ఇటూ వేసి. రెండు చేతులతోనూ రంపం పట్టుకుని కిందికీ పైకీ కొయ్యబోయింది. దానివల్ల కాలేదు. అది చాలా బిగువుగానూ. బరువుగానూ వుంది. అటూ ఇటూ కదిలిస్తూ మరిన్ని ప్రయత్నాలుచేసింది. అలా ప్రయత్నాలు చెయ్యడంలో దాని తోక. చీలివున్న కలప పలకలమధ్యఇరుక్కుపోయింది. రంపం కాస్త ముందుకు కదలడంతో చీలిన పలకలు దగ్గరై తోకను బిగించేశాయి. కిచకిచ శబ్దాలతో కోతి లబోదిబోమంది. కుయ్యోమొర్రోమంది. గట్టిగాఅరిస్తే తల్లివస్తుంది. తండ్రి వస్తాడు. దిగబడిన తోకని లాగడానికి బదులు. తననినాలుగు తిట్టి తల కూడా తీసేస్తారు. తేలు కుట్టిన దొంగలాగ కోతి అవస్థపడింది. తన పూర్వీకుల సహాయం పొందిన శ్రీరాముడినీ. పూర్వీకులనీ ప్రార్థించింది.

శ్రీరాముడు రాలేదుగాని. చిరంజీవి గనక. హనుమంతుడు దిగివచ్చాడు. అంత పెద్ద హనుమంతుడినీ అతనితోకనీ చూసి. కోతిపిల్ల హడిలిపోయింది. హనుమంతుడు చూశాడు. అప్పటికే దానితోక పలకలమధ్య ఇరుక్కుని ఊడిపోయింది. పాపం కోతిపిల్ల అది గమనించలేదు; ఇంకా తన తోక తనతోనే వుందనుకుంటోంది. హనుమంతుడు ఒంటివేలితో కోతిపిల్లని ఎత్తి చెట్టుకొమ్మమీద కూచోపెట్టాడు. సంజీవినీ పర్వతం మీదికి ఎగిరివెళ్ళి మందేదో తెచ్చి తోక వూడిన చోట పూసి. దానిబాధ తగ్గించాడు. ఐతే. తోక మాత్రం కలపలో ఇరుక్కుని వుండిపోయింది. దీన్నేం చెయ్యాలి? కోతిపిల్లకే తిరిగి తగిలిద్దామని చూస్తే అంతలోనే అది పారిపోయింది. హనుమంతుడు పలకలమధ్య ఇరుక్కునివున్న తోకని పైకిలాగాడు "ఏం చెయ్యాలి?" అని ఆలోచించాడు. తోకని అటూ ఇటూ ఊపుతూ. అతనికో ఆలోచన వచ్చింది. తోక ఒక్కటే తక్కువ. అనిపించుకున్న వాళ్ళు మనుషుల్లో చాలామంది వున్నారు. పాపం. తాను వాళ్ళ లోటు ఎందుకు తీర్చకూడదు? ఐతే ఈ ఒక్క తోకతో అంతమంది లోటూ తీరదు గనక. కనీసం ఒక్కడికైనా తీర్చవచ్చు ఎవరికి తగిలించాలి? అని ఆలోచించి. పనీ పాటా లేకుండా రోజల్లా కుర్చీలో కూచుని తన చుట్టూ మనుషుల్ని తిప్పుకుంటూ ఏదైనా గిల్లిగజ్జా తెచ్చి దేశంలో అలజడి ఆరంభించడం ఎలారా. అని ఆలోచిస్తున్న ఒక రాజకీయవాదికి ఆ తోకని తగిలించేసి పారిపోయాడు ఆంజనేయుడు.



విశాఖపట్నంలో నాట్యాచారుడు శ్రీ డి.వై. సంపత్‌కుమార్ నిర్వహిస్తున్న "శ్రీ గీతా నృత్యకళా క్షేత్రం" ప్రారంభోత్సవ సభ అక్టోబరు 30 న జరిగిన సందర్భంగా ఉపన్యసిస్తున్న ఏలూరు అదనపు రెవెన్యూడివిజనల్ ఆఫీసర్ డిప్యూటీ కలెక్టర్ శ్రీ బోయిన వెంకటేశ్వరరావు. ప్రక్కన వున్నది మాజీ శాసనసభ్యుడు శ్రీ ఎ. అప్పన్న దొర. విశాఖ మేయరు శ్రీ ఎన్. ఎస్. ఎన్. రెడ్డి. శ్రీమతి లక్ష్మీరెడ్డి